నేడు 'వలంటీర్స్-జన్మభూమి కమిటీలు' అంశంపై రౌండ్ టేబుల్

విశాలాంధ్ర-గుంటూరు : వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం, అవర్ స్టేట్ అవర్ లీడర్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదిన ఉదయం 10.30 గంటలకు గుంటూరులోని హోటల్ సింధూరిలో 'వలంటీర్స్-జన్మభూమి కమిటీలు' అంశంపై సమగ్ర విశ్లేషణ రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు సంస్థ కన్వీనర్ జి.శాంతమూర్తి తెలిపారు. ముఖ్యవక్తలుగా మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక, తెలుగు భాషా అకాడమీ అధ్యక్షురాలు ఎస్.లక్ష్మీపార్వతి, ఆంధ్రప్రదేశ్ ఫైబర్ నెట్‌వర్క్ అధ్యక్షులు గౌతమ్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ మైనారిటీ కమీషన్ ఉపాధ్యక్షులు జాషువా డానియల్, ఏపీఎస్ఆర్టీఎస్ అధ్యక్షులు మేడపాటి వెంకట్, ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ సామ్యూల్ జోనాథన్, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు ఎం.శేషగిరిరావు హాజరుకానున్నట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు పూర్తి చేయాలి : కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనను త్వరగా పూర్తి చేయాలని, బిఎల్ఓలు తమ పరిధిలోని ఓటర్లకు పోలింగ్ కేంద్రం వివరాలు తెలియచేయాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్ఓ) కీర్తిచేకూరి ఇంజినీరింగ్ అధికారులను, బిఎల్ఓలను ఆదేశించారు. గురువారం గుంటూరు తూర్పు నియోజక వర్గంలోని సెక్టార్3 లోని పాత గుంటూరు, వినోభా నగర్, ఎల్బీ నగర్ తదితర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను ఏఆర్ఓలు, సెక్టోరల్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించి తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో ఏఆర్ఓలు సునీల్, భీమరాజు, వెంకట లక్ష్మీ, సెక్టోరల్ అధికారులు, పాల్గొన్నారు.

పార్లమెంట్ అభ్యర్థి కిలారిని కలిసిన సుభాని

విశాలాంధ్ర-దుగ్గిరాల : పొన్నూరు శాసనసభ్యులు, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యను పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా పలువురు ముస్లిం పెద్దలతో కలిసి దుగ్గిరాల గ్రామానికి చెందిన వైసీపీ మైనారిటీ సెల్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని తదితరులు గుంటూరులోని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలసి శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. మే నెలలో జరిగే సార్వత్రిక ఎన్నికలలో వైసీపీకి ముస్లిం సోదరులందరూ మద్దతు తెలపాలని, రాష్ట్రంలో ముస్లింల సంక్షేమానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందన్నారు. ముస్లిం సోదరులందరికీ కిలారి పవిత్ర రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారని సుభాని తెలిపారు.

రేంజ్ ఐజీగా బాధ్యతలు స్వీకరించిన త్రిపాఠి

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు రేంజ్ ఐజీగా సర్వశ్రేష్ఠ త్రిపాఠి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన గుంటూరు అర్బన్ జిల్లా ఎస్పీగా పనిచేశారు. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఇతర ముఖ్య అధికారులు మర్యాద పూర్వకంగా రేంజ్ కార్యాలయంలో కలిసారు.

న్యాయవాది గంట సతీష్ కుమార్‌కు 'డాక్టరేట్'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు బార్ అసోసియేషన్‌లో న్యాయవాద వృత్తి ప్రాక్టీస్ చేస్తున్న గంట సతీష్ కుమార్ కోనేరు లక్ష్మయ్య విశ్వవిద్యాలయం(కేఎల్ యూనివర్సిటీ)న్యాయ శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కెఐ పవన్ కుమార్ మార్గదర్శకంలో 'సైబర్ క్రైమ్ అండ్ సైబర్ లా ఇన్ ఇండియా పర్స్పెక్టివ్' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ (పీహెచ్‌డీ)పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ నేర పరిశోధనలలో డిజిటల్ చట్టంలోని చిక్కులపై సునిశిత దృష్టితో దేశంలో సైబర్ స్పేస్‌ను నియంత్రించే చట్టపరమైన ఫ్రేమ్ వర్క్‌ను అర్థం చేసుకోవడానికి ఇప్పటికే ఉన్న చట్టాలపై అవగాహన కలగడంతో పాటు డిజిటల్ డొమైన్‌లో అభివృద్ధి చెందుతున్న సవాళ్లను పరిష్కరించడానికి ఈ పరిశోధన ఉపయోగపడుతుందన్నారు. డాక్టర్ గంట సతీష్‌కుమార్ డాక్టరేట్ పొందిన సందర్భంగా కెఎల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డాక్టర్ కెవిఎస్ఎం కామ్ సాయి, ఎం.రమా సత్యనారాయణ, న్యాయవాదులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, చింత రామకోటిరెడ్డి, సురేంద్ర అభినందనలు తెలియజేశారు.

నిర్మల ఫార్మశీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి నగర పరిధిలోని నిర్మల ఫార్మసి కళాశాలలో ప్రముఖ బహుళ జాతీయ సంస్థ ఇన్ పో క్యూరిస్ ప్రాంగణ ఎంపికలు జరిగాయని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పాముల రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 150 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరుకాగా పలు రకాల వడపోత తర్వాత 15 మందిని ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. ఎంపికైన వారికి జీతభత్యాల రూపంలో మూడు లక్షల రూ. అందుతాయన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, కళాశాల సెక్రటరీ సిస్టర్ నిర్మల జ్యోతి అభినందించారు. ఈ ప్రాంగణ ఎంపికలో కంపెనీ ప్రతినిధులు దీపక్, కుమారి గౌతమి, కార్తీక్, దురాప్రసాద్, ప్లేస్‌మెంట్ అధికారి ఎస్.కామేశ్వరరావు, డాక్టర్ సుధీర్, వి.జోజి బాబు ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు 'పుస్తకాలు' బహుమతిగా ఇచ్చే సంస్కృతి అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పిల్లలు పుస్తకాలు చదవటం వల్ల జ్ఞాపకశక్తి పెరగడమే కాక భాషా పరిజ్ఞానం, భాష మీద ఆసక్తి, ఏకాగ్రత పెరుగుతాయనే విషయాన్ని గ్రహించి చిన్నారులకు ప్రతి సందర్భంలోనూ పుస్తకాలను బహుమతిగా ఇచ్చే సంస్కృతి పెద్దలు అలవర్చుకోవాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అవగాహన సంస్థ కార్యాలయంలో 'అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆటలు ఆరోగ్యాన్నిస్తే, పుస్తకాలు మానసిక వికాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. పిల్లలకు చిన్నతనం నుంచే పుస్తకాలు చదవ టాన్ని అలవాటు చేయడం ద్వారా వారిలో సృజనాత్మకత, ఊహాశక్తిని పెంచవచ్చన్నారు. పుస్తకాలు చదివే పిల్లల్లో సమాజాన్ని అర్థంచేసుకునే శక్తి, విశ్లేషణ సామర్థ్యం పెరుగుతాయని, వీరు ఇతర చిన్నారుల కంటే చురుగ్గా ఉంటారని పేర్కొన్నారు. చిన్నారులు బొమ్మలతో కూడిన కథల పుస్తకాలు చదవటానికి ఎక్కువ ఇష్టపడతారని, అలా చదవటం అల వాటు చేసుకుంటే క్రమంగా పుస్తకాలు వారి నేస్తాలుగా మారతాయన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

గుంటూరు రూరల్, చల్లావారిపాలెం, డోరు నెం.12-17రు కాపురస్తులు వంది సాంబయ్యా గారి కుమారుడు వంది శివనారాయణ రావు (సెల్: 78931 53150) అను నేను నా పేరిట గల పాస్‌పోర్ట్ నెం. S7091625 ఒరిజినల్‌ను ది.25-03-2024న నా ఇంటి వద్ద నుండి నల్లపాడు సెంటర్‌కు ఫొటోస్టాట్ నిమిత్తం టూవీలర్‌పై వెళ్లుచుండగా పోగొట్టుకున్నాను. ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

పాస్‌పోర్ట్ పోయినది

గుంటూరు సిటీ, అడవితక్కెళ్లపాడు రోడ్డు, రాజధాని టవర్స్, ఫ్లాట్ నెం. 101 రు కాపురస్తులు **Mohammad Khushal Khan** గారి కుమారుడు **Mohammad Afzhal Khan** (సెల్: 9849506782) అను నేను నా పేరిట గల పాస్‌పోర్ట్ నెం. E8995338 (గడువు ముగిసిన పాస్‌పోర్ట్) ఒరిజినల్‌ను ది.21-03-2024న నా ఇంటి వద్ద నుండి ఆర్టీవో ఆఫీసు వద్ద గల ఫొటోస్టాట్ సెంటర్‌కు జిరాక్సు నిమిత్తం బైకుపై వెళ్ళుచుండగా పోగొట్టుకున్నాను. ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించిన కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జిల్లాలో సాధరణ ఎన్నికలకు ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులుగా నియమించిన ఉద్యోగులకు శిక్షణ కేంద్రాల కేటాయింపుకు గురువారం సాయంత్రం కలెక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి ఎన్ఐసీ పోర్టల్ ద్వారా మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించి ఉత్తర్వులను జనరేట్ చేశారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోని 1915 పోలింగ్ కేంద్రాలలో పీవో, ఏపీవోలుగా రిజర్వు సిబ్బందితో కలిపి 4600 మంది ఉద్యోగులకు పోలింగ్ కేంద్రాలలో నిర్వహించాల్సిన విధులపై నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాలలో ఏప్రిల్ 15,16వ తేది మొదటి శిక్షణ కార్యక్రమాన్ని ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, ఎన్నికల మ్యాన్ పవర్ నోడల్ అధికారి శైలజ, ఎన్ఐసీ డిఐఓ బిమల్ కుమార్, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ ఏఈఆర్వో బీమారావు పాల్గొన్నారు.

సమస్యలపై దశలవారీ చర్యలు

– మంగళగిరి వాసులకు పెమ్మసాని స్పష్టత

విశాలాంధ్ర-మంగళగిరి : మాకు కళ్యాణ మండపం సమస్య ఉంది. మండపం నిర్మాణం చేసి ఇమ్మని అడిగితే ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఇటువైపు రావడమే మానేశారని మంగళగిరిలోని 16వ వార్డుకు చెందిన ఓ మహిళ స్థానిక ఇబ్బందులను గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కి వివరించారు. మంగళగిరి పర్యటనలో భాగంగా గురువారం ఉదయం స్థానిక 14, 15, 16 వార్డుల్లో డాక్టర్ పెమ్మసాని పర్యటించారు. ఈ సందర్భంగా వార్డుల్లో నిర్వహించిన డోర్ టు డోర్ పర్యటనలో భాగంగా నివాస ప్రాంతాలు, వస్త్ర, వాణిజ్య, వ్యాపార, కూరగాయల దుకాణాలలోని వ్యక్తులను ఆయన కలుసుకున్నారు. స్థానిక సమస్య లను అడిగి తెలుసుకోవడంతో పాటు ఎమ్మెల్యే ఆర్కే కారణంగా తలెత్తిన ఇబ్బందులపై వివరాలు సేకరించారు. పర్యటనలో భాగంగా కబేలా, టౌన్ హోల్, కళ్యాణమండపం తదితర సమస్యలపై స్థానికులు స్పందించారు. తమ సమస్యలను పరిష్కరించమని స్థానిక ఎమ్మెల్యే రామ కృష్ణారెడ్డిని ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోలేదన్నారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ స్థానికులు తమ తమ సమస్యలను తెలిపారన్నారు. స్థానిక సమస్యల దృష్ట్యా దశలవారీగా పరిష్కారం చూపించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి నియోజక వర్గం సమన్వయకర్త నందం అబద్దయ్య, మంగళగిరి టౌన్ టీడీపీ అధ్యక్షుడు దామర్ల రాజు, సెక్రటరీ షేక్ రియాజ్, జనసేన పార్టీ మంగళగిరి, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు మునగ పాటి మారుతీరావు, చేనేత విభాగం జనసేన రాష్ట్ర కార్యదర్శి జంజనం సాంబశివరావు, దుగ్గిరాల మండల అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, మంగళగిరి టౌన్ ప్రెసిడెంట్ కాండ్రు భాను కిశోర్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు తులిమిల్లి శ్రీనివాసరావు, నరసరావుపేట ఓబీసీ ఇన్‌చార్జ్ కొలికారు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదవాళ్ళ కన్నీళ్లలో వైసీపీ కొట్టుకుపోవడం ఖాయం

విశాలాంధ్ర-గుంటూరు : అధికారం కోసం ఎలాంటి అరాచకాలకైనా పాల్పడే వైసీపీ నేతల చూపు ఇప్పుడు వృద్ధులు, వికలాంగులపై పడిందని, పింఛన్ల పంపిణీపై వైసీపీ కుట్ర రాజకీయాలకు తెరతీసి పేదల జీవితాలతో చెలగాటమాడుతుందని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి ఆవేదన వ్యక్తం చేశారు. పేదల కన్నీళ్లలో వైసీపీ ప్రభుత్వం కొట్టుకుపోవటం ఖాయమని ఆయన అన్నారు. పింఛన్ కోసం సచివాలయాలకు వచ్చిన వృద్ధులు, వికలాంగులకు జనసేనాని పిలుపుమేరకు గురు వారం ఆయన మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ అసలే వేసవికాలం కాలం కావటంతో ఎండలు మండుతున్నాయని, ఈ నేపథ్యంలో వైసీపీ నేతలకు కనికరం కూడా లేకుండా దుష్ట రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. వృద్ధుల ఉసురు ఊరికేపోదన్నారు. ఖజానాలో ఉన్న డబ్బు మొత్తాన్ని తన అనుయాయులకు, బినామీలకు కట్టబెట్టిన జగన్ రెడ్డి సామాజిక పింఛన్ల పంపిణీకి మాత్రం ఇప్పటికీ పూర్తి స్థాయిలో డబ్బు పంపిణీ చేయకపోవడం దుర్మార్గమని అన్నారు. ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడ్డాక సంపద సృష్టితో మరిన్ని సంక్షేమ పథకాలు అమలుచేసేందుకు కృషి జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సోమి ఉదయ్ కుమార్, సయ్యద్ షర్ఫుద్దీన్, నందూరి స్వామి, మహేష్, మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రత్తిపాడు నియోజకవర్గ సమావేశం

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : సీపీఐ ప్రత్తిపాడు నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ హాజరవుతున్నారని, ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ప్రత్తిపాడు నియోజక వర్గ సీపీఐ కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు.

వైసీపీకి జిల్లా వక్ఫ్ బోర్డు జాయింట్ సెక్రటరీ సుభాని రాజీనామా

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్టు గుంటూరు జిల్లా వక్ఫ్ బోర్డు జాయింట్ సెక్రెటరీ షేక్ సుభాని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ ఎస్సీ, మైనార్టీల ఓటు బ్యాంకుని వాడుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చక పోగా వారిపై ఈ ప్రభుత్వంలో దాడులు ఎక్కువయ్యాయన్నారు. ఎమ్మెల్యే మద్దాలి గిరి, అతని పీఏ కొంతమంది వ్యక్తులచే నాపై దాడి చేయించడం జరిగిందని, వారిపై అధికారులకు, వైసీపీ పార్టీలో ఉన్న నాయకులకు దాడికి సంబంధించిన వివరాలను సాక్షాలతో సహా తెలిపినప్పటికీ ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. వైసీపీ అధికారంలో వచ్చిన తర్వాత ప్రతిపక్ష పార్టీల వ్యక్తుల పైనే కాకుండానే సొంత పార్టీ కార్యకర్తలపై వైసీపీ నాయకులు హత్యలకు, దాడులకు పాల్పడ్డారన్నారు.

7న ఉగాది ఉమ్మడి కుటుంబం

విశాలాంధ్ర-గుంటూరు : టాలీవుడ్ స్టార్ విజయ్ దేవరకొండ ముఖ్యఅతిథిగా తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పండగ ఉత్సవం ఫ్యామిలీ స్టార్‌తో ఉగాది ఉమ్మడి కుటుంబం ఈ నెల 7న సాయంత్రం 6 గంటలకు జీ తెలుగులో ప్రసారం కానుంది. జీ తెలుగు తారలతో కలిసి విజయ్ చేసిన డ్యాన్స్ అందరినీ ఆకట్టుకుంది. ఇక డ్రామా జూనియర్స్ పిల్లలు విజయ్ దేవరకొండ కోసం ప్రత్యేకంగా చేసిన స్కిట్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తుంది. సరదాలతో సంబరంగా సాగే ఈ కార్యక్రమంలో విజయ్ దేవరకొండ నటించిన తాజా చిత్రం ఫ్యామిలీ స్టార్ ట్రైలర్‌ను ప్రదర్శించనున్నారు. రాశి, కస్తూరి, సితార, నాగినీడు, ఇషాచావ్లా, దీప్తిమన్నె, అనిల్ వంటల పోటీలో పాల్గొన్నారు. ప్రముఖ కమెడియన్ అలీ సంభాషణలు నవ్వులు పంచుతాయి. రెట్రో స్పెషల్ స్కిట్స్‌లో ఎన్టీఆర్-సావిత్రిగా రాఖీ-ఐశ్వర్య, కృష్ణ-జయప్రదగా యశ్వంత్-సుస్మిత, కృష్ణంరాజు-జయసుధగా రఘు-గౌతమి, ఏఎన్నార్-శ్రీదేవిగా మనోజ్-సౌందర్య ప్రత్యేక ప్రదర్శనతో ఆకట్టుకోనున్నారు. వేలు స్వామిగా బిత్తిరి సత్తి తనదైన శైలిలో పంచాంగం చెప్పి కడుపుబ్బా నవ్వించనున్నారు. ఆషికా పదుకొణె, తేజస్విని జుగల్బందీ డాన్స్ కాంపిటీషన్ అందరినీ ఆకట్టుకోనుంది.

ఫిలిం సొసైటీలో సభ్యులుగా చేరండి

విశాలాంధ్ర- తెనాలి : మంచి సినిమా నలుగురితో కలిసి చూడడం వ్యాపారత్మక మూస చిత్రాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న ప్రధాన స్రవంతిలోని వెకిలి సినిమాలకి ప్రత్యామ్నాయంగా, ప్రయో గాత్మక, ప్రయోజనకర, ప్రజాభ్యుదయ చిత్రాలను ప్రదర్శించుకుంటూ కళ సంకుచితం కాదు సార్వత్రికమని బలంగా వెలుగెత్తి చాటిచెప్ప గలగడమే ఫిలిం సొసైటిల లక్ష్యమని ఫిలిం సొసైటి ఛైర్మన్ డా.రావిపాటి వీరనారాయణ చెప్పారు.

తెనాలి గాంధీనగర్‌లోని ఫిలిం సొసైటి హాలులో తెనాలి కల్చరల్ ఫిలిం సొసైటి, చిల్డ్రన్స్ ఫిలిం సొసైటి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావే శంలో ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సభకు తెనాలి కల్చరల్ ఫిలిం సొసైటి ప్రధాన కార్య దర్శి బొల్లిముంత కృష్ణ స్వాగతం పలికారు. వీరనారాయణ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ కళాత్మక మాధ్యమంగా మంచి సినిమాను ప్రమోట్ చేయడంతోపాటు విలువలతో కూడిన చిత్రాల పట్ల ప్రజా ధరణ పెంపొందించడానికి ఫిలింసొసైటిలు ప్రారంభమయ్యాయన్నారు. మూవీ మేళా పేరుతో కూడా మంచి సినిమాలను ప్రజలకు చేరువ చేసేందుకు ఫిలింసొసైటి ప్రయత్నిస్తుందని చెప్పారు.

తెనాలి ఫిలింసొసైటి క్యూబా, న్యూజిలాండ్, పోలాండ్, రష్యా, స్వీడన్ తదితర దేశాల ఫీచర్ ఫిలింలను ప్రదర్శించడంతోపాటు ప్రగతిశీల మేధావులతో ప్రసంగాలు ఇప్పించి ప్రజాచైతన్యం కోసం కృషి చేస్తున్నామని మరల విద్యార్థులు, యువకులు, మేధావులు ఫిలింసొసైటి కార్యక్రమాలకు ప్రోత్సాహం ఇవ్వాలని పిలుపునిచ్చారు. తెనాలి ఫిలింసొసైటి తరఫున నేటికి నాలుగు అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలు ఘనంగా నిర్వహించామని గుర్తు చేశారు. భవిష్యత్తులో కూడా ఫిలింసొసైటీలను ఆదరించి హార్థిక, ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కల్చరల్ ఫిలింసొసైటి ప్రధాన కార్యదర్శి బొల్లిమంత కృష్ణ మాట్లాడుతూ సినిమా మాధ్యమం ద్వారా బాలల్లో ప్రజల్లో మానసిక వికాసం, కళల పట్ల, జీవితం పట్ల అవగాహన పెంపొందించడం కోసం ఉత్తమ సినిమాలను ప్రదర్శించాలని ఆ కోవలో మన తెనాలి కల్చరల్ ఫిలింసొసైటి పయనిస్తుందన్నారు.

తెనాలి కల్చరల్ ఫిలింసొసైటిని రాష్ట్రాలు మారినందున ఆంధ్రప్రదేశ్ కల్చరల్ ఫిలింసొసైటిగా మార్పు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సొసైటి ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సొసైటిలను కలుపుకొని భవిష్యత్తులో మంచి చిత్రాలను ప్రదర్శిస్తూ విద్యార్థుల్లో మార్పు తెచ్చేందుకు కూడా కృషి చేస్తానని చెప్పారు.

కార్యక్రమంలో డా.రామరాజు, డా.కొత్త శివరామకృష్ణ ప్రసాద్, పాటిబండ్ల శ్రీనివాసరావు, ప్రొఫెసర్ లలితానంద ప్రసాద్, వెంకటరత్నం, ప్రభాకరరెడ్డి, లక్ష్మారెడ్డి, సోమయ్యశాస్త్రి, శ్రీదేవి, నాగమణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లింగంశెట్టి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-తాడేపల్లి : లింగంశెట్టి కిషోర్ కుమార్ జన్మదినం సందర్భంగా గురువారం ఉండవల్లి కరకట్ట వెంబడి ఉన్న చిగురు అనాథ ఆశ్రమంలో 300 మంది చిన్నారులకు అన్నదానం నిర్వహించారు. అంతకు ముందు ఉండవల్లి సెంటర్‌లో లింగంశెట్టి కిషోర్ కుమార్ కార్యాలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం 150 మంది భవన నిర్మాణ కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థానానికి చేరుకోవాలని అన్నారు. లింగంశెట్టి కిషోర్ కుమార్ అనేక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తూ లింగంశెట్టి కిషోర్ కుమార్ ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అమరా సుబ్బారావు, జంగాల సాంబశివరావు, కొమ్మారెడ్డి కిరణ్, కళ్ళం రాజశేఖర్ రెడ్డి, నల్లిబోయిన శ్రీనివాస్, టి.నాగేశ్వరరావు, లీలా కృష్ణా, రాయపూడి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మూడు నెలలకొకసారి డిపార్ట్‌మెంట్ 'ఇంటర్నల్ ట్రైనింగ్' ఉండాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : లేబొరేటరీలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ప్రతి మూడు నెలలకొకసారి ఇంటర్నల్ ట్రైనింగ్ అవసరమని, దీని ద్వారా కొత్త కొత్త విధానాల ద్వారా నీరు, ఆహార పరీక్షలలో కల్తీని కనుగొనే సరికొత్త పద్ధతులను నేర్పించడం జరుగుతుందని సీవిల్ సర్జన్, బ్యాక్టీరియా లజిస్ట్ డాక్టర్ జి.శోభారాణి పేర్కొన్నారు. శిక్షణా విధానాలు ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరమని ఆమె తెలిపారు. గుంటూరు రీజినల్ లేబొరేటరీలో 'కొత్త పరికరాలు-విధానాలు-వాటి ఉపయోగం' అనే అంశంపై జరిగిన 15 రోజులు శిక్షణా కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటీవ్ మెడిసన్ డైరెక్టర్ నూతలపాటి పూర్ణ చంద్రరావు శిక్షణ పూర్తి చేసుకున్న ఉద్యోగులకు శిక్షణా సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. లేబొరేటరీలో బ్యాక్టీరియాలజిస్ట్ డాక్టర్ శోభారాణి ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్లు, శాంపిల్ టేకర్స్, జూనియర్ అనలిస్ట్ ఇంటర్నల్ శిక్షణా కార్యక్రమానికి సీనియర్ వాటర్ అనలిస్ట్ వినుకొండ రాజారావు ట్రైనింగ్ ప్రోగ్రాం ఆర్గనైజర్‌గా వ్యవహరించారు. మాజీ సైంటిఫిక్ ఆఫీసర్స్ జేవి రావు, మాజీ వాటర్ ఎనలిస్ట్ హరిప్రసాద్ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఒంగోలు, నరసరావుపేట, గుంటూరు లేబొరేటరీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో ల్యాబ్ టెక్నీషియన్లు ఎస్.భాస్కరరావు, రామకృష్ణ, నాగేశ్వర రెడ్డి, శాంపిల్ టేకర్ వాణి, శివ కుమార్, సీనియర్ అనలిస్ట్ విజయ కుమారి, డాక్టర్లు సిరాజుద్దీన్ ఖాన్, డాక్టర్ శారద పాల్గొన్నారు.

మండలంలో ముమ్మరంగా వాహనాల తనిఖీలు

విశాలాంధ్ర-ఫిరింగిపురం : ఈ నేపథ్యంలో మద్యం, నగదు అక్రమంగా తరలిస్తున్న వస్తువులను పట్టుకునేందుకు మండలంలో అన్ని ప్రాంతాలలో రహదారులలో పోలీసు సిబ్బందితో కలిసి సీఐ వీరేంద్రబాబు గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎన్నికల కోడ్ నిబంధనలను ఉల్లంఘిస్తే ఎంతటి వారిపైన అయిన చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోబడతాయని ఆయన తెలిపారు. సీఐ వెంట ఎస్సై వీరనారాయణ, రైటర్ దేవదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వృద్ధురాలు మృతి

విశాలాంధ్ర - తాడికొండ : ఏప్రిల్ 4 బైక్ ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ రావు తెలిపిన వివరాల ప్రకారం మోతాడికి గ్రామానికి చెందిన పెనుముచ్చు అంజమ్మ 80 సంవత్సరాలు అనే వృద్ధురాలు గురువారం రాత్రి గ్రామంలో రేషన్ బియ్యం తీసుకొని రోడ్డు దాటుతుండగా అమరావతి వైపు నుండి వేగంగా వస్తున్న బైక్ వృద్ధురాలని ఢీకొట్టింది ఈ ఘటనలో వృద్ధురాలు అక్కడికక్కడే మరణించగా బైక్ నడుపుతున్న యువకునికి కూడా తీవ్ర గాయాలు కావడంతో గుంటూరు ఆసుపత్రికి తరలించారు సీఐ ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు

30వ వార్డులో పారిశుద్ధ్యం అధ్వానం

విశాలాంధ్ర-పొన్నూరు: పొన్నూరు పట్టణంలోని 30వ వార్డు శంకరమఠం దేవస్థానం ఎదురుగా 3 రోజుల నుంచి చెత్త వ్యర్థాలు రోడ్డుపైనే పడి దుర్గంధం వెదజల్లుతుంది. మున్సిపల్ సిబ్బంది పట్టించు కోవటం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. దేవస్థానం ఎదురుగా వ్యర్థాలు ఉండటంతో భక్తులకు తీవ్ర ఆటంకంగా మారిందని దేవస్థానం సిబ్బంది తెలిపారు. మున్సిపల్ సిబ్బంది చెత్త వ్యర్థాలను తదొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రకటన

ఇందుమూలముగా మా క్లయింటు అయిన గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, పెనుమాక గ్రామ కాపురస్తుడు **కళ్ళం రంగారెడ్డి, తండ్రి కళ్ళం సాంబిరెడ్డి గారి** సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా...

నా క్లయింటు యొక్క తండ్రి గారు అయిన **కళ్ళం సాంబిరెడ్డి గారికి 1983**కు పూర్వమే మూజువాణీ భాగ పంపిణీ ద్వారా సంక్రమించిన ఆస్తిని వారు బ్రతికియున్న కాలంలో నా క్లయింటు అయిన **కళ్ళం రంగారెడ్డి గారి** పేరుమీద వీలునామాను వ్రాయించి శ్రీ మంగళగిరి సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో **ది.26-05-2012వ తేదీన 3వ పుస్తకం ద.నెం.76/2012**రుగా రిజిష్టరు చేయించిన రీత్యా పెనుమాక గ్రామ **సర్వే నెం. 230రు యం. 50 సెంట్లున్నూ, డి.నెం.229రు య0.66 2/3 సెంట్లున్నూ వెరశి య1.16 2/3 సెంట్లున్నూ, డినెం. 176/ 1రు నందు చ.గ.175లు** అందులో గల పురాతన పెంకుటిల్లున్నూ సంక్రమించినది. **కళ్ళం సాంబిరెడ్డి గారు 16-02-2013వ తేదీన** మరణించియున్నారు. వారి మరణానంతరం అట్టి ఆస్తి నా క్లయింటు అయిన **కళ్ళం రంగారెడ్డి**కి వీలునామా ద్వారా పూర్తి హక్కులతో పై తెలిపిన ఆస్తి సంక్రమించి తదాది స్వాధీనములో ఉండియున్నది.

ఈ ఆస్తి పైన ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరములు ఉన్నయెడల పత్రికలో ప్రచురించబడిన తేదీ నుండి **7 రోజులలోపు** అభ్యంతరములు క్రింది అడ్వకేట్ గారికి తెలియపరచగలరు. ఆ తదుపరి వచ్చిన అభ్యంతరములు పరిగణనలోనికి రావు.

ప్రత్తిపాటి నవజీవన్, అడ్వకేట్,
ఎమ్.ఎ., ఎల్.ఎల్.బి.,
మంగళగిరి, సెల్ నెం. 9989301351
మంగళగిరి, తేది. 04-04-2024

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

నగరపాలక సంస్థ పరిధిలో 92 శాతం పెన్షన్ పంపిణీ

విశాలాంధ్ర-మంగళగిరి : కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గురువారం మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని సచివాలయల పరిధిలో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ కమిషనర్ నిర్మల్ కుమార్ పెన్షన్ పంపిణి ప్రక్రియను పరిశీలించారు. పెన్షన్ దారులు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పా ట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. వికలాంగులు, దివ్యాంగులు, వితంతు వులు, చక్రాల కుర్చీలో ఉండే వికలా ంగులకు, మంచాలలో ఉండే వృద్ధులకు, స్వయంగా ఇంటి వద్దకు వెళ్లి పెన్షన్ ఇచ్చేలా ఏర్పాట్లు చేయడం జరిగినదని ఆయన తెలిపారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని వార్డు సచివాలయాల్లో లబ్దిదారులకు పింఛన్ అందజేశారు. పలు సచివాల యాల్లో పర్యటించి పింఛన్ సొమ్ముల పంపిణీని పరిశీలించారు. అలానే అందరు సచివాలయ సిబ్బంది తమతమవార్డులలోని పెన్షన్ లబ్దిదారులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పంపిణీ కార్యక్రమం సజావుగా సాగే విధంగా చూడాలని ఆదేశించారు.

వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర-గుంటూరు : గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ఉన్న వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధికి కృషి చేస్తానని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గళ్ళా మాధవి పేర్కొన్నారు. గురువారం గుంటూరు చుట్టు గుంట వాకింగ్ ట్రాక్‌లో మాధవి పర్యటించారు. ఈ సందర్భముగా వాకర్స్‌ను కలుసుకొని, అక్కడ ఎదురుకొంటున్న సమస్యలను తెలుసుకొన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం వాకింగ్ ట్రాక్‌లను అభివృద్ధి చేస్తామని, రోజుకు వందల మంది ప్రజలు చుట్టుగుంట వాకింగ్ ట్రాక్‌కు వస్తారని, వారికి మెరుగైన వసతులు కల్పిస్తానని మాధవి హామినిచ్చారు. ఈ కార్యక్రమంలో గాలం వెంకటేశ్వర్లు, కసుకుర్తి హనుమంతరావు, అప్పారావు యాదవ్, బుడే, ఆడక శ్రీను, ఖాసీం సైదా, చెంబేటి మణికుమారి, లామ్ వర్ధన్, రాజీవ్ ఆనంద్, యాకోబు, చంద్ర, ప్రమీల, దాసరి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటును పూర్తి చేయాలి : కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: పెరుగుతున్న ఎండల దృష్ట్యా నగరంలో ప్రజలకు, నగరానికి విచ్చేసేవారి దాహార్తి తీర్చాడానికి చలివేంద్రాల ఏర్పాటును పూర్తి చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలో చలి వేంద్రాల ఏర్పాటు, సిబ్బంది కేటాయింపు పై నగరపాలక సంస్థ ఎస్.ఈ., ఇంజినీరింగ్ అధికారులకు సెట్ ద్వారా తగు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున నగరంలోని ప్రధాన కేంద్రాల్లో, అధికం గా ఉండే ప్రాంతాల్లో నగరపాలక సంస్థ తరుపున సుమారు 45 ప్రాంతాల్లో చలి వేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించగా ఇప్పటికే 19 ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం జరిగిందని,త్వరగా పూర్తి చేయాలని ఎస్ఈని ఆదేశించారు.

ఘనంగా శ్రీచైతన్య పాఠశాల నందు 'గ్రాడ్యుయేషన్' వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక బుర్రిపాలెం రోడ్డులో ఉన్న శ్రీచైతన్య పాఠశాల నందు గ్రాడ్యుయేషన్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య పాఠశాల ఏజీఎం నూతలపాటి అంజయ్య, ప్రిన్సిపల్ లక్ష్మీపతి మాట్లాడుతూ ప్రాథమిక విద్య పూర్తి చేసుకుని ద్వితీయ సంవత్సరం విద్య అభ్యసించటానికి విద్యార్థులందరూ మాధ్యమిక సంవత్సరం లోకి ప్రవేశిస్తున్న సందర్భంగా గ్రాడ్యుయేషన్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల వెలువడిన ఐఎస్టీఎస్ఓ ఫలితాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు గెలుపొందిన వారికి ఆర్ఐ అప్పాజీ, ఎంఈఓ ఎం.లక్ష్మీ నారాయణలు విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కో-ఆర్డినేటర్ గోపి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నాక్లయింట్ అయిన గుంటూరుసిటీ, శ్యామలానగర్ 3వ లైను, డోర్.నెం.2-14-118 కాపురస్తురాలు వంగా ఉషాజ్యోతి C/o. యం.శ్రీనివాస రెడ్డి గారి సూచనల మేరకు యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, నాక్లయింటు సోదరుడైన లేటు మేకా రాధాకృష్ణ రెడ్డిగారి కుమారుడు రమేష్ రెడ్డి గారికి ది.18-10-2021న దఖలు దస్తావేజు నెం.6619/2021 నల్లపాడు యస్.ఆర్.ఓ. ద్వారా మేకా రాధాకృష్ణారెడ్డి మరియు మేకా గిరీష్ రెడ్డిగారి వలన సంక్రమించి సర్వ సంపూర్ణ హక్కులతో అనుభవించుచున్నారు. నాక్లయింటు సోదరుడు ప్రస్తుతం 2770 Stone Hall, Dr. Marietta, GA.30062-U.S.A. నివసించుచున్నందున అతని ఆస్తి తాలూకు దస్తావేజులను నాక్లయింటు జిరాక్స్ నిమిత్తం తీసుకొని వెళుచుండగా సదరు దస్తావేజులలోని ఒక ఒరిజినల్ లింకు విక్రయ దస్తావేజు నెం.3071/2013 ఎక్కడో పోయినది. సదరు విషయమై ఎంత వెతికిననూ దొరికియుండలేదు. కావున ఎవరికైనా సదరు దస్తావేజు దొరికినయెడల నాకు గాని, నాక్లయింటుకు గాని తెలియజేయగలరని మరియు దిగువ షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు, తనఖాలు, తాకట్లు ఇతర క్లయిములు ఉన్నయెడల వ్రాతపూర్వ కంగా నాకుగాని, నాక్లయింటుకు గాని తెలియజేయగలరు.

షెడ్యూలు:గుంటూరు డి॥, నల్లపాడు సబ్.డి., గుంటూరు మునిసిపల్ కార్పోరేషన్ యేరియాలో చేరి టౌన్ సర్వే కానటువంటి, గుంటూరు సిటీ, శ్యామలానగర్ ఏరియా బాపతు నల్లపాడు గ్రామం తాలూకు డి.నెం.224/డి రు మింజుమలె నెం.141రు ప్లాటు, డోరు.నెం.2-14-119 రు, అసెస్మెంట్ నెం.1588రు గల చ.గ.476లు స్థలములో నిర్మించబడిన **"వైష్ణవి నిలయం అపార్టుమెంట్స్"** ఆస్తికి **హద్దులు:తూర్పు:**ఈ ఆస్తి తాలూకు ప్రహరీగోడ, లక్కవరపు రాధాకృష్ణమూర్తి గారి నెం.140రు ప్లాటు ఆస్తి ప్రహరీ గోడ వెరశి ఈహద్దు,అ.80లు,**దక్షిణం:**ఈఆస్తి తాలూకు ప్రహరీ గోడ,నెం.146రుపాటు ఆస్తి ప్రహరీగోడ వెరశి ఈ హద్దు. అ.53-6లు,**పడమర:**పెమ్మరాజు రామారావు గారి నెం. 142రు ప్లాటు ఆస్తి హద్దు. అ.80లు,**ఉత్తరం:**ఈ ఆస్తి తాలూకు ప్రహరీగోడ,అ.40లు వెడల్పుగల రోడ్డు వెరశి హద్దు. అ.53-6లు. ఈ హద్దుల మధ్య చ.గ.476 లు లేక చ.మీ.398-00ర్లు స్థలములో ఈ ఫ్లాటుకు కేటాయించ బడిన చ.గ.52-1/2లు లేక చ.మీ.43-58ర్లు స్థలభాగ మున్నూ, సదరు స్థల భాగమునకు గానూ మొత్తము స్థలము లో నిర్మించబడిన **"వైష్ణవి నిలయం"** అపార్టుమెంట్స్ నందలి థర్డ్ ఫ్లోరు లోని నెం.401రు ఫ్లాటుకు **హద్దులు: తూర్పు:**ఓపెన్ టు స్కై హద్దు. **దక్షిణం:** ఓపెన్ టు స్కై హద్దు. **పడమర:** ఓపెన్ టు స్కై హద్దు,**ఉత్తరం:**కామన్ కారిడార్, కామన్ మెట్లు మరియు కామన్ లిఫ్ట్ హద్దు.యీ హద్దుల మధ్య గల చ.అ.1563 లు (కామన్ ఏరియా మరియు స్టిల్ట్ ఫ్లోర్లో గల కారు పార్కింగ్తో కలిపి) గల థర్డ్ ఫ్లోరులోని నెం.401రు ఫ్లాటు, సదరు ఫ్లాటుకు అమర్చియున్న యావద్విశిష్ట సామాన్లు మరియు మెట్లు, లిఫ్ట్ బోరింగ్, మోటారు, కామన్ ఏరియా, టెర్రస్, వగైరాలతో జాయింటు ఈజ్మెంట్ హక్కులతోన్నూ సహా.

VAKA INDIRA PRIYA NAGA DARSINI,
Advocate, J.K.C. College Road, Guntur. Cell: 8074094461

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

పోలింగ్ పర్సనల్స్ ఎన్నికల శిక్షణాకు తప్పనిసరిగా హాజరుకావాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లాలోని ఎన్నికల సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. సోమవారం ఉదయం 11 గంటలకు జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల పీఓ, ఏపీఓల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించడం జరిగిందని కలెక్టర్ అన్నారు. పోలింగ్ పర్సనల్స్ ఎన్నికల శిక్షణా కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలని, ఈ విషయమై సంబంధిత రిటర్నింగ్ అధికారులు పోలింగ్ పర్సనల్స్‌కి తెలియజేయాలన్నారు. ఎన్నికల శిక్షణకు సంబంధిం చిన ట్రైనింగ్ ఆర్డర్స్ పోలింగ్ పర్సనల్స్ అందరికీ రావడం జరుగుతుందని, పోలింగ్ పర్సనల్స్ అందరూ పోస్టల్ బ్యాలెట్ కోసం అవసరమైన ఫామ్-12ని ఫిల్ చేసుకుని తీసుకుని శిక్షణకు వచ్చేలా వారికి ఆర్ఓలు స్పష్టంగా తెలపాలని ఆదేశించారు. జిల్లాలో 2,370 మంది పిఓ (ప్రిసైడింగ్ అధికారులు), 2,375 మంది ఏపిఓ (అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు)లకు ఎన్నికల శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత వైఎస్సార్‌దే

విశాలాంధ్ర-పిడుగురాళ్ల : పిడుగురాళ్ల పట్టణంలోని 25, 26 వార్డులలో గురువారం ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఎమ్మెల్యే మహేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డిదన్నారు. నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించి ముస్లింలకు విద్యా, ఉద్యోగ అవకాశం కల్పించిన నేత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిదని కొనియాడారు.మసీదులో పనిచేస్తున్న ఇమామ్, మౌజాన్‌లకు జీతాలు ఇచ్చిన ఘనత కూడా ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డిదే అన్నారు. ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులకు స్వయంగా భోజనం వడ్డించారు. ఈ విందులో కొత్త చిన్న వెంకట సుబ్బారావు, జైనులబ్దిన్, బంగారురెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాసరావు, సుధీర్, గొట్టిముక్కల పవన్ రెడ్డి, నరసింహారావు, చీదెళ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాప్య పెన్షన్లు యధావిధిగా పంపిణీ చేయాలి

విశాలాంధ్ర-వినుకొండ: ప్రస్తుత పరిస్థితులు దృష్టిలో పెట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్, మే నెలల వృద్ధాప్య పెన్షన్లు పంపిణీ ప్రతి ఒక్క పెన్షన్దారులు సంబంధిత సచివాలయ అధికారుల వద్దకు వెళ్లి పెన్షన్లను తీసుకోవాలి అని ఇటీవలే అధికారులు సూచనలు చేయటం చాలా బాధాకరం అని అఖిలపక్ష పార్టీ నాయకులు విచారం వ్యక్తంచేశారు. సంబంధిత సమస్య స్థానిక మున్సి పల్ కమిషనర్ ఆదేశాలు మేరకు స్థానిక మున్సిపల్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేసిన అఖిలపక్ష పార్టీ నాయకులు మరియు ప్రజా సంఘాల నాయకులు ఈ సందర్భంగా ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు బాజీద్ షేక్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏ విధంగా అయితే వృద్ధులకు, వితంతువులకు పెన్షన్ పంపిణీ కార్యక్రమం ఎలా జరిగిందో అదేవిధంగా పెన్షన్ పంపిణీ చెయ్యాలి అని డిమాండ్ చేశారు. ఇప్పటికే వృద్ధులు, వితంతువులు సంబంధిత సచివాలయాల వద్ద పడిగాపులు కాస్తూ, కనీస వసతులు మంచినీటి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర అవస్థలకు గురవుతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ఈ రెండు మాసాలు లబ్ధిదారుల ఇండ్ల వద్దకే పెన్షన్ పంపిణీ కార్యక్రమం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

10,11వ వార్డుల్లో విస్తృత పర్యటన

విశాలాంధ్ర - వినుకొండ : వాలంటీర్లు అంటే చంద్రబాబుకు భయం పట్టుకుందని, ఎమ్మెల్యే బ్రహ్మనాయుడన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి 10,11వ. వార్డుల్లో విస్తృతంగా పర్యటించి ప్రజలను తనను గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. వృద్ధులు కాలు బయట పెట్టకుండా పెన్షన్లు అందిస్తున్న వాలంటీర్ వ్యవస్థపై. చంద్రబాబు అక్కసు వెళ్ళ కక్కుతూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించాడని బ్రహ్మనాయుడు విమర్శించారు. తన ఈ ఐదేళ్ల హయాంలో పట్టణ ప్రజలకు త్రాగునీటి ఎద్దడి లేకుండా చూశానని, అలాగే పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేశానన్నారు. తనను మరొకసారి గెలిపించి పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసే అవకాశం ఇవ్వాలని బొల్ల బ్రహ్మనాయుడు ఆయా ప్రాంత ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్టా మహోత్సవం

విశాలాంధ్ర-పెదకూరపాడు: మండల పరిధి లోని తమ్మవరం హుస్సేనగరం గ్రామంలో కొలువై ఉన్న వినాయక స్వామి, బొడ్రాయి విగ్రహ, ప్రతిష్టా రేణుక అంకమ్మ మహోత్సవంలో పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వామి వార్ల ఆశీస్సులతో నియోజక వర్గంలో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాతో, పాడిపంటలతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సత్తెనపల్లి ప్రజల ఆత్మగౌరవం కోసం పాటుపడతా

విశాలాంధ్ర-సత్తెనపల్లి : స్థానికుడు, యువకుడు, విద్యావంతుడైనా నేను సత్తెనపల్లి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల ఉపాధి, ఆత్మగౌరవం కోసం పాటుపడతానని జైభీమ్ రావ్ భారత్ పార్టీ(జేబీపీ) సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి, పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం సత్తెనపల్లి పెన్షనర్ అసోసియేషన్ హాలులో విశ్రాంత ఉద్యోగులతో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్తెనపల్లికి చెందిన స్థానికులు ఎమ్మెల్యేలుగా గెలిచినవావిలాల గోపాలకృష్ణ, యర్రం వెంకటేశ్వరరెడ్డి, కోడెల శివప్రసాదరావులు అభివృ ద్ధిలో నియోజకవర్గ రూపు రేఖలు మార్చారన్నారు. పక్క జిల్లాల నుంచి వచ్చిన స్థానికేతరులు ఇక్కడికొచ్చి అభివృద్ధిని పట్టించుకోవటం లేదని ఆరోపించారు. నేను స్థానికుడ్ని స్థానిక ఎమ్మెల్యేలు అభి వృద్ధి చేసినట్లుగా తాను కూడా చేస్తానని పేర్కొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తాను పార్టీ తరుపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని కోటు గుర్తుకే ఓటు వేసి నన్ను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బొద్దు రామారావు, కేబీఆర్‌జే ప్రసాద్, మనికే సంగీతారావు, సయ్యద్ జయనుల్లా బీస్, దాసరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి వస్తేనే పేదల కష్టాలు తీరుతాయి

విశాలాంధ్ర-శావల్యాపురం : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే పేదల కష్టాలు తీరుతాయని, అలాగే రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని తెలుగుదేశం పార్టీ యువ నాయకులు గోనుగుంట్ల హరీష్ బాబు అన్నారు. మండలంలోని బొందిలపాలెం గ్రామంలో గురువారం శంఖారావం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం తెలుగుదేశం మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, యువతకు ఉద్యోగాలు లభించాలన్న కూటమి ప్రభుత్వం, చంద్రబాబుతో సాధ్యమని అన్నారు. రాబోయే ఎన్నికల్లో అందరూ ఐక్య మత్యంగా ఉండి టీడీపీకు మద్దతు ఇచ్చి ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులుకి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎరమాసు కోటేశ్వరావు, మండల పార్టీ అధ్యక్షులు గుంటూరు సాంబశివరావు, టీడీపీ నాయకులు చింతా వెంకటేష్, చల్లగుళ్ళ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో రూ.1.34 కోట్ల నగదు, మద్యం, సామాగ్రి సీజ్

- జిల్లా కలెక్టర్ శివశంకర్

విశాలాంధ్ర-నరసరావుపేట : ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన మార్చి నెల 16 తేదీ నుంచి ఇప్పటివరకు పల్నాడు జిల్లాలో రూ.1,34,30,000ల నగదు, మద్యం, ఇతర సామగ్రిని సీజ్ చేశామని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పారదర్శకంగా, శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. జిల్లావ్యాప్తంగా తొమ్మిది ప్రాంతాలలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ఐదు శాఖల అధికారులు నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణలో తనిఖీలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ తనిఖీలలో ఇప్పటివరకు రూ.39.92 లక్షల నగదు, రూ.32.82 లక్షల విలువైన మద్యం, రూ.52.65 లక్షల విలువైన సామగ్రి, రూ.8.90 లక్షల విలువైన ఇతర వస్తువులను సీజ్ చేసామని కలెక్టర్ అన్నారు. జిల్లావ్యాప్తంగా ఫ్లయింగ్ స్క్వాడ్‌లు తిరుగుతున్నాయని రాజకీయ పార్టీల నాయకులు ఎంసీసీ నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా సి విజిల్ ద్వారా 750 ఫిర్యాదులు అన్యాయని 98 శాతం పరిష్కరించామన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా ఎన్నికలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు సేకరిస్తున్నామన్నారు. సుమేధ యాప్ ద్వారా రాజకీయ పార్టీలకు అనుమతులు మంజూరు చేస్తున్నా మని తెలిపారు. ఓటర్ల నమోదు, బదిలీలకు సంబంధించి ఫారం 6, 8లను ఏప్రిల్ 14వ తేదీ వరకు అధికారులు స్వీకరిస్తారని తెలిపారు. జిల్లాలో ఎన్నికలు నిష్పక్ష పాతంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని విధాల చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ శివ శంకర్ అన్నారు.

సచివాలయాల వద్ద కొనసాగుతున్న సందడి

విశాలాంధ్ర-పిడుగురాళ్ల : పట్టణంలోని పలు వార్డు సచివాలయాల దగ్గర ఉదయం ఏడు గంటల నుంచి వృద్ధులు, వికలాంగులు సందడి మొదలైంది. గత రెండురోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉదయం 7 గంటల ప్రాంతం కెల్లా సచివాలయాల వద్ద అరుగుల మీద బైఠాయించారు. కేవలం సచివాలయం వాకిళ్ళ ముందు మాత్రమే టెంట్లు వేసారు. తాగునీటి సౌకర్యం కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఇంటి వద్దకే వచ్చి పెన్షన్లు ఇస్తారు అంటున్నారు కానీ కొందరు వార్డు వలంటీర్లు సచివాలయాల వద్దకు వెళితేనే మీకు పెన్షన్లు ఇస్తారని చెప్పటం మూలంగా చేసేదేమీ లేక తప్పని పరిస్థితులలో నడవలేని స్థితిలో వచ్చినట్లు తెలిపారు. తీవ్రమైన మోకాళ్ళ నొప్పులతో ఇబ్బందిపడుతూ సచివాలయాల వద్దకు వచ్చినట్లుగా తెలిపారు. పింఛను కోసం మంగళ, బుధవారం కూడా వచ్చినట్లు కొందరు వృద్ధులు, మహిళలు తెలిపారు. సిబ్బంది కనీసం వరుస క్రమంలోనైనా పింఛన్లు అందిస్తే బాగుంటుందన్నారు. పట్టించుకునే అధికారులు లేకపోవడంతో అరుగుల మీద కూర్చుని పడిగాపులు కాస్తున్నామని వాపోయారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఇంటి వద్దకు వచ్చి పెన్షన్లు మంజూరు చేయాలని పింఛనుదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని మార్చండి

విశాలాంధ్ర-గురజాల: నియోజకవర్గ శాసనసభ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయుటకు దరఖాస్తు చేసుకున్న వ్యక్తులు అందరు కలిసి కాంగ్రెస్ అధిష్ఠానం అభ్యర్థిగా ప్రకటించిన టి ఎలమందరెడ్డి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నేతలు గురువారం నిరసన తెలిపారు. స్థానికంగా గత 40 సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తూ కాంగ్రెస్ పార్టీకి పనిచేస్తున్నటువంటి ఇక్కడ స్థానిక నాయకు లకు ఇవ్వాలని, యలమందా రెడ్డి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో సమావేశం ఏర్పాటు చేసుకొని తీర్మానం చేయడం జరిగింది. గత 40 సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీని అంటిపెట్టుకుంటూ పనిచేస్తున్న పల్నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ మీడియా కోఆర్డినేటర్ కరాలపాటి జానీ, నియోజకవర్గ ఎస్సీ సెల్ అసంఘటితక అధ్యక్షులు కే ట్యజన్, రాష్ట్ర అసంఘటితకార్మిక విభాగపు ఉపాధ్యక్షులు షేక్ గౌస్, సంపత్ వెంకట్ పాల్గొని తీర్మానం చేయడం జరిగింది.

ప్రజాగళాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర-సత్తెనపల్లి : ఈ నెల 6వ తేదీ సాయంత్రం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రజాగళం యాత్ర సందర్భంగా సత్తెనపల్లిలో కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరగనున్న సభను, ర్యాలీని జయప్రదం చేయాలని తెలుగు మహిళా నేతలు కోరారు. గురువారం ఉమ్మడి అభ్యర్థి, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రజాగళం కార్యక్రమంలో నియోజకవర్గంలోని మహిళలందరూ పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర పార్టీ ఆర్గనైజేషన్ సెక్రటరీ భీమనేని వందనాదేవి, పార్లమెంటు మహిళా ఉపాధ్యక్షురాలు తోట అంబిక, మండల మహిళా అధ్యక్షురాలు మల్లేశ్వరి, పార్లమెంటు మహిళా కార్యదర్శులు బి.రాజేశ్వరి, ఆండాళ్లు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి షాక్

విశాలాంధ్ర-పెదకూరపాడు: పెదకూరపాడులో వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీలో కీలకంగా వ్యవహరించిన రైతు నాయకుడు కర్ణం వసంతరావు తన అనుయాయులు వడ్లమూడి సాంబశివరావు, పసుపులేటి శ్రీనులతో కలసి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గురువారం మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు అర్తిమల్ల రమేష్ ఆధ్వర్యంలో కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సమక్షంలో వైసీపీను వీడారు. ప్రవీణ్ స్వయంగా నాయకులకు కండువా కప్పి పార్టులోకి ఆహ్వానించారు.వసంతరావు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని ఐదు కోట్ల ఆంధ్రుల కలల రాజధాని అమరావతిని చిదిమేసారని, తాగు, సాగు నీరు ఇవ్వలేని అసమర్థ ప్రభు త్వంలో కొనసాగ లేక తెలుగుదేశంలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు.

టీడీపీ గెలుపు తథ్యం

విశాలాంధ్ర-రెంటచింతల : మాచర్ల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మానందరెడ్డి సతీమణి శోభారాణి రెంటచింతలలో గురువారం పర్యటనలో భాగంగా ఆంజనేయస్వామి మన్యంలో గడప గడప తిరిగారు. రాబోవు ఎన్నికల్లో బ్రహ్మారెడ్డి గెలుపు ద్వారా మాచర్ల సెగ్మెంట్‌లో అభివృద్ధికి నాంది పలకాలని ఓటర్లను అభ్యర్థించారు. వీరి వెంట సుమంత్ రెడ్డి, పాల్గొన్నారు.

ప్రజాగళం రోడ్డు షోను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-సత్తెనపల్లి : సత్తెనపల్లిలో ఈ నెల 6వ తేదీన జరగబోయే ప్రజాగళం రోడ్డుషోను విజయవంతం చేయాలని నాయకులకు మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజాగళం కార్యక్రమం, పల్నాడు జిల్లా పర్యటనలో భాగంగా ఈ నెల 6వ తేదీన సత్తెనపల్లి పట్టణంలో రోడ్డుషో ఉంటుందన్నారు. కార్యక్రమానికి సంబంధించి రూట్ మాప్ విధివిధానాలు, నాయకులకు దిశా నిర్దేశం చేసి, గ్రామాలలో నాయకులకు, కార్యకర్తలు, అభిమానులు, యువతకు తెలియజేసి పెద్దఎత్తున పాల్గొనేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమం భారీ ఎత్తున నిర్వహించి, పెద్ద ఎత్తున విజయవంతం చేయడానికి మండల పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, నియోజక వర్గ పార్టీ పదవులలో ఉన్న నాయకులు,ఐటీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకుని పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-అమరావతి : మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కంభంపాటి నాగేశ్వరరావు కోటేశ్వరమ్మ కుమారుడు ఫ్రాన్సిస్, ఎలీషారాణిల వివాహ మహోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణ కోసం పటిష్ట చట్టాన్ని రూపొందించాలి

విశాలాంధ్ర-సత్తెనపల్లి : నెల్లూరు జిల్లాలోని ఉదయగిరిలో న్యాయవాది రాజగోపాలరెడ్డిపై మర్రిపాడు ఎస్ఐ ఇంద్రసేనా రెడ్డి దాడి చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్ కుమార్ అన్నారు. గురువారం సత్తెనపల్లి పట్టణంలో ఉన్న నాలుగు న్యాయస్థానాల్లో, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించారు. నెల్లూరు జిల్లాలోని ఉదయగిరిలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న రాజగోపాల రెడ్డిపై మర్రిపాడు ఎసై ఇంద్రసేనారెడ్డి దాడి చేయటాన్ని తీవ్రంగా ఖండించటమే కాక సత్తెనపల్లి పట్టణంలోని తాలూక న్యాయస్థానం ప్రాంగణంలో ఉన్న న్యాయదేవత విగ్రహం ముందు న్యాయవాదులు నిరసన ప్రదర్శన చేశారు. నినాదాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కంబాల అనిల్ కుమార్ మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ కోసం పటిష్టమైన చట్టాన్ని రూపొందించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం న్యాయవాదుల పరిరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు దివ్వెల శ్రీనివాసరావు, బత్తిన శ్రీనివాసబాబు, ఉడుముల విద్యాసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో చలివేంద్రాలు, చలువ పందిర్లు, మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-సత్తెనపల్లి : సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్, ఆర్డీవోలకు న్యాయవాది నరిశేటి వేణుగోపాల్ బహిరంగ లేఖ వ్రాశారు. వేసవికాలం వచ్చేసిందని ఎండతీవ్రత పెరిగిందనీ ప్రజల సౌకర్యార్థం సత్తెనపల్లి పట్టణ ప్రధాన ప్రాంతాల్లో చలివేంద్రాలు, చలువ పందిర్లు, మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేయాలని న్యాయవాది, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నరిశేటి వేణుగోపాల్ కోరారు. గురువారం అయన విలేకరులతో మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజల సౌకర్యార్థం తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలు, చర్యలు గురించి సంబంధిత అధికారులు, సిబ్బందితో తక్షణమే సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ సమావేశం ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. పట్టణంలోని స్థానిక ప్రజలతో పాటు సత్తెనపల్లి నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వివిధ రకాల పనుల మీద నిత్యం వేలాది మంది ప్రజలు పట్టణంలోకి రాకపోకలు సాగిస్తున్నారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం పలు ముందస్తు జాగ్రత్తలు మున్సిపల్ అధికారులు తీసుకోవాలన్నారు.

టీడీపీ మండల పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన భాష్యం ప్రవీణ్

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల కేంద్రంలో టీడీపీ మండల పార్టీ కార్యాలయాన్ని ఉమ్మడి కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీకి కంచుకోట పెదకూరపాడు మండలం అని, నియోజకవర్గంలో టీడీపీ గెలుపు ఖాయమన్నారు. ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేసి పార్టీ అభివృద్ధికి, గెలుపుకి కృషి చేయాలని నాయకులకు కార్యకర్త లకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడిపి కార్యదర్శి అత్తిమల రమేష్, బెల్లంకొండ రామ్ గోపాలరావు, భాష్యం ఆంజనేయులు, మద్దినేని వెంకట సత్యనారాయణ, కల్లా బాబురావు, షేక్ ముంతాజ్, పాటిబండ్ల బాలయ్య, నూర్జహాన్, షేక్ అజముల్లా, కరిముల్లా, మిలిటరీ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ఎండ తీవ్రతకు గురికాకుండా జాగ్రత్తలు తప్పనిసరి

విశాలాంధ్ర-నరసరావుపేట : ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రజలందరూ వడదెబ్బ బారిన పడకుండా ఈ క్రింది సూచనలను పాటించి స్థానిక వాతావరణ సమాచారం తెలుసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని పల్నాడు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి ఒక ప్రకటనలో సూచించారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. వీటికి తోడు వడగాలులు కూడా వీస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం....

వడదెబ్బ లక్షణాలు:
తలనొప్పి, తల తిరగటం, తీవ్రమైన జ్వరం, మత్తు నిద్ర, కలవరింతలు, ఫిట్స్, పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితి ఏర్పడతాయి.

ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు:
తెలుపు రంగు గల పలుచటి కాటన్ వస్త్రాలను ధరించాలి. నెత్తికి టోపీ పెట్టుకోవాలి లేదా రుమాలు కట్టుకోవాలి. వీలైనంతవరకు ఇంట్లో ఉండటానికి ప్రయత్నించాలి. దాహం వేయకపోయినా తరచుగా నీటిని త్రాగాలి. ఉప్పు కలిసిన మజ్జిగ, గ్లూకోజు, ఓఅర్ఎస్ కలిసిన నీటిని త్రాగాలి. వడదెబ్బకు గురైన వారిని నీడ ఉన్న చల్లటి ప్రాంతానికి వెంటనే చేర్చాలి. వడదెబ్బకు గురైన వారిని తడిగుడ్డతో శరీరం రుద్దుతూ ఉండాలి. ఐస్ నీటిలో బట్టను ముంచి శరీరం తుడవాలి. శరీర ఉష్ణోగ్రత 101- డిగ్రీస్ కంటే లోపునకు వచ్చేవరకు ఐస్ వాటర్ బట్టతో శరీరాన్ని తుడుస్తూ ఉండాలి. వడదెబ్బకు గురైన వారు సాధారణ స్థితికి రానిచో వారిని దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలి. మంచినీరు ఎక్కువ సార్లు తాగించాలి. ఇంటి నుంచి బయటకు వెళ్ళేముందు ఒక గ్లాస్ మంచి నీరు ఎండలో నుంచి వచ్చిన వెంటనే చల్లని నిమ్మరసము గాని, కొబ్బరినీరు లేదా చల్లని నీరు త్రాగాలి. తీవ్రమైన ఎండలో బయటికి వెళ్ళినప్పుడు తలతిరుగుట మొదలైన ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడితే దగ్గరలో ఉన్న వైద్యుణ్ణి సంప్రదించి ప్రాథమిక చికిత్స పొంది వడదెబ్బ బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు చేయకూడనివి:
సూర్యకిరణాలకు, వేడి గాలికి గురి కాకుడదు. వేడిగా ఉన్న సూర్యకాంతిలో గొడుగు లేకుండా తిరుగరాదు. వేసవికాలంలో నలుపు రంగు దుస్తులు మందంగా ఉండే దుస్తులు ధరించరాదు. నెత్తికి టోపీ లేక రుమాలు లేకుండా సూర్యకాంతిలో తిరుగరాదు. బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు బయట తిరగరాదు. వీరిపై ఎండ ప్రభావం త్వరగా చూపే అవకాశం ఉంది. శరీరాన్ని డీహైడ్ చేసే ఆల్కహాల్, టీ, కాఫీ, కార్బోనేటెడ్ శీతల పానీయాలు మానుకోవాలి. అధిక ప్రోటీన్, ఉప్పు, కారం, నూనె ఉండే పదార్థాలు తీసుకోవద్దు. వడదెబ్బకు గురైన వారిని వేడి నీటిలో ముంచిన బట్టతో తుడువరాదు. దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేర్చుటలో ఏ మాత్రం ఆలస్యం చేయరాదు. మధ్యాహ్నం తర్వాత(అనగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటలు మధ్యకాలంలో) ఆరుబయట ఎక్కువ శారీరక శ్రమతో కూడిన పనిచేయరాదు. ఎండలో బయట నుంచి వచ్చిన వెంటనే తీపిపదార్థములు, తేనె తీసుకొనకూడదు. శీతలపానీయము, మంచుముక్క వంటివి తీసుకొంటే గొంతుకు సంబంధించిన ఆనారోగ్యం ఏర్పడుతుంది. వడదెబ్బ వల్ల ప్రభావితమైన వ్యక్తికి చికిత్స చేయడానికి

చిట్కాలు:
వ్యక్తిని చల్లని ప్రదేశంలో, నీడ కింద పడుకోబెట్టాలి. ఆమెను/అతన్ని తడి గుడ్డతో తుడవండి/బాడీని తరచుగా కడగాలి. తలపై సాధారణ ఉష్ణోగ్రత నీటినిపోయాలి. శరీర ఉష్ణోగ్రతను తగ్గించడం ప్రధాన విషయం. వ్యక్తికి ఓఆర్ఎస్ త్రాగడానికి లేదా నిమ్మరసం లేదా శరీరాన్ని రీహైడ్రేట్ చేయడానికి ఉపయోగపడే వాటిని ఇవ్వాలి. వ్యక్తిని వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్ళాలి. హీట్ స్ట్రోక్‌లు ప్రాణాంతకంగా మారే అవకాశం ఉన్నందున రోగికి తక్షణ చికిత్స అవసరము. ప్రమాదంలో ఉన్న వ్యక్తులు చల్లని వాతావరణం నుంచి వేడి వాతావరణానికి వచ్చిన వారు. హీట్ వేవ్ సీజన్‌లో మీరు అలాంటి వ్యక్తి(లు) మీ కుటుంబాన్ని సందర్శించి ఉండవచ్చు. శరీరం వేడికి అలవాటు పడే వరకు వారు ఒక వారం పాటు బహిరంగ మైదానంలో తిరగకూడదు. పుష్కలంగా నీరు త్రాగాలి.

వైసీపీ ఆధ్వర్యంలో భారీ ఇఫ్తార్ విందు

విశాలాంధ్ర-సత్తెనపల్లి : సత్తెనపల్లి పట్టణంలోని సువిశాలమైన ఈద్గా ప్రాంతం ముస్లిం సోదరులతో నిండిపోయింది. రంజాన్ పండుగ ముందే వచ్చినట్లుగా 12 వేల మందికిపైగా నియోజకవర్గ వ్యాప్తంగా ముస్లిం సోదరులు వైసీపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, నరసరావుపేట పార్లమెంటు అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్, నియోజకవర్గ పరిశీలకులు పడాల శివారెడ్డిలు పాల్గొన్నారు. ముస్లిం మత పెద్దలతో కలిసి నమాజులో పాల్గొన్నారు. రానున్న ఏడాది అంతా రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలకు మేలు చేసిన ప్రభుత్వాన్ని అల్లా దీవించాలని వారు ప్రార్థించారు. ఉపవాసం ముగించిన ముస్లిం సోదరులం దరికీ ప్రత్యేక పౌష్టికాహారాన్ని మంత్రి అంబటి, అనిల్ యాదవ్ స్వయంగా వడ్డించి, ఆప్యాయంగా పలకరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు, వైసీపీ అనుబంధ సంఘాల బాధ్యులు, ముస్లిం సంఘాల నేతలు పాల్గొన్నారు.

వైసీపీలో చేరికలు

విశాలాంధ్ర-వినుకొండ : స్థానిక కూరగాయల మార్కెట్ నుంచి 30 కుటుంబాలు వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మ నాయుడు ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెసు పార్టీలోకి చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ వైయస్సార్ కాంగ్రెసు పార్టీ కుటుంబ సభ్యులని, వీరికి తగిన గుర్తింపు గౌరవం ఉంటుందని తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు రాజీనామాలు

విశాలాంధ్ర-కారంపూడి: ఎన్నికల ప్రచారంలోపాల్గొనేందుకు వాలంటీర్లు రాజీనామాలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. గురువారం ఎంపీడీవో జి.శ్రీనివాసరెడ్డికి సుమారు 50 మంది వాలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు చేసినట్లు పత్రాలను అందించారు. వాలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనవద్దని ఎలక్షన్ కమీషన్ ఆక్షంలు విధించడంతో వాలంటీర్లు ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొని విస్తృతంగా ప్రచారం చేసి జగన్‌ను తిరిగి సీఎం చేసేవరకు విశ్రమించమంటున్నారు.

ఉమ్మడి పార్టీల ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర-వినుకొండ : స్థానిక 18వ వార్డు నందు గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి తిరిగి తెలుగు దేశం పార్టీ పథకాల గురించి వివరిస్తున్న వినుకొండ నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ పార్టీల ఉమ్మడి అభివృద్ధి జీవి ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఈ కార్యక్రమంలో టీడీపీ-జనసేన-బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా ఎస్పీగా బిందు మాధవ్

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లా ఎస్పీగా బిందు మాధవ్‌ను నియమిస్తూ ఎన్నికల సంఘం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 2017 ఐపీఎస్ క్యాడర్‌కు చెందిన బిందు మాధవ్ గతంలో పల్నాడు జిల్లా ఏ.ఎస్.పి(అడ్మిన్)గా పనిచేసి గత ఏడాది ఉద్యోగొన్నతి పొంది గ్రేహౌండ్స్‌ఎస్పీగా బదిలీఅయ్యారు. పల్నాడు జిల్లా ఎస్పీగా పని చేసిన శివశంకర్‌రెడ్డి ఎన్నికల విధుల్లో అలసత్వం వహించినందుకు ఎన్నికల సంఘం ఆయనను ఎన్నికల విధుల నుండి తప్పిస్తూ బదిలీ చేసింది. బిందు మాధవ్‌ను గ్రేహౌండ్స్ నుండి పల్నాడు జిల్లా ఎస్పీగా నియమిస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది.

వైసీపీని వీడి టీడీపీలో చేరికలు

విశాలాంధ్ర-సత్తెనపల్లి రూరల్: సత్తెనపల్లి రూరల్ మండలం కందుల వారి పాలెం గ్రామం నుండి 10 కుటుంబాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగు దేశం పార్టీలో చేరారు. వీరందరినీ మాజీ మంత్రి, సత్తెనపల్లి నియోజక ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీ మీకెప్పుడు అండగా ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో వివిధ హోదాల్లో వున్న నియోజకవర్గం, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా ఆపరేషన్లు

విశాలాంధ్ర-నరసరావుపేట: కంటి శుక్లాలు, నీటి కాసులతో బాధపడుతున్న పేదలకు అయుష్మాన్ భారత్ పథకం కింద ఉచితంగా ఆపరేషన్ చేస్తున్నామని పట్టణంలోని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ రామలింగారెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అందత్వ నివారణ వారోత్స వాలను ఈనెల 21వ తేదీ నుండి 27వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని సందర్భంగా కంటి సమస్యలున్న రోగులకు పరీక్షలు నిర్వహించి తగిన మందులు, ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. చిన్న పిల్లల్లో వచ్చే దృష్టి లోపానికి తప్పనిసరిగా కళ్ళజోళ్ళు వాడాలని సూచించారు. కంటి సమస్యలు ఉన్నవారు ఆకుకూరలు, గుడ్లు, పాలు ఎక్కువగా తీసుకోవాలని, క్రమం తప్పకుండా డాక్టర్‌ను సంప్రదించి మందులు వాడాలన్నారు. డాక్టర్ పరమేశ్వర్ రెడ్డి, డాక్టర్ శాంతి శ్రీ, డాక్టర్ ప్రకృతి పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తకి నివాళులర్పించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-అమరావతి : మండలంలోని మునుగోడు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త రామిరెడ్డి నాగిరెడ్డి అనారోగ్యంతో మరణించారు. పెదకూరపాడు శాసన సభ్యులు నంబూరు శంకరరావు నాగిరెడ్డి మృత దేహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరి వెంట పలువురు పాల్గొన్నారు.

శాంతి సహనం అలవర్చుకోవాలి : భాష్యం ప్రవీణ్

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిధిలోని లింగంగుంట్ల గ్రామంలో తెలుగు బాప్టిస్ట్ చర్చిని ఉమ్మడి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ ప్రారంభించారు. పున:ప్రతిష్ట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ శాంతి సహనం అలవర్చుకోవాలని క్రైస్తవ సోదరులకు సూచించారు. ప్రేమ ఆప్యాయతలకు చిరునామా యేసుక్రీస్తు అని, ప్రతి ఒక్కరూ ఆయన బాటలో నడవాలని భక్తులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు అత్తిమల రమేష్, బెల్లం రాంగోపాలరావు, మురళీ, గంగినేని లీలావతి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పలువురు ప్రముఖులు టీడీపీలో చేరిక

విశాలాంధ్ర-పిడుగురాళ్ళ : పట్టణానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్, నియోజకవర్గ కాపు నాయకుడు నూతి నారాయణ మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. అదేవిధంగా పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కొత్త సాంబశివరావు(వనజ)తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. యరపతినేని వీరికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు గత వారం రోజులుగా పిడుగురాళ్ల పట్టణంలోని పలువురు ప్రముఖులు వైఎస్సార్‌సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరటం గమనార్హం. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.